చెత్త కుప్పలు.. ముప్పతిప్పలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు


మల్లికార్జునపురం గ్రామంలో రోడ్డుపై చెత్తాచెదారం

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లె పంచాయతీ కొత్తపల్లె, మల్లికార్జునపురం, చంద్రగిరి, సుగాలి తాండ, ఎర్రబల్లె గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు సాఫీగా సాగడం లేదు. కొన్నిచోట్ల రోడ్లపై మురుగునీరు నిలుస్తోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులతో రోజు కాలువల్లో పూడికతీత పనులు చేపడితే ఈ పరిస్థితి ఉండదని ప్రజలు అంటున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. మురుగునీరు నిల్వ ఉన్నచోట కనీసం బ్లీచింగ్ పౌడర్ అయినా చల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి రోడ్లపైన ఉన్న చెత్తాచెదారాలను తొలగించాలని కోరుతున్నారు.

తొలగించండి సారూ..

కమలాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న చెత్త కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లే చిన్నారులు ఈ చెత్త ఉన్న రోడ్డుపై నుంచే వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి కూత వేటు దూరంలో ఇలా చెత్త కుప్పలు ఉంటే పిల్లలకు రోగాలు రావా అని చిన్నారుల తల్లులు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ అంటే ఇదేనా అని నిలదీస్తున్నారు. చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులను పలుమార్లు కోరినా స్పందించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి చెత్త కుప్పను తొలగించాలని కోరుతున్నారు.


అంగన్‌వాడీ కేంద్రం వద్ద రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

పందుల స్వైర విహారం

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని స్థానిక పుల్లయ్య తోటలో చెత్తాచెదారం పేరుకుపోయింది. నెల రోజులుగా అక్కడ నుంచి చెత్తను తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చెత్త పేరుకుపోవడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో దుర్వాసన భరించలేక ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించి చెత్త కుండీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


చెత్తాచెదారంలో స్వైర విహారం చేస్తున్న పందులు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని హనుమాన్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, ప్రభుత్వాసుపత్రి, హైస్కూలు, పులివెందుల రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం, పాత మార్కెట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ జేఈ శివ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 33/11కె.వి విద్యుత్ ఫీడర్‌లోని అన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

అందుబాటులో లేని అధికారులు

– ఉసూరుమంటూ వెనుదిరిగిన ప్రజలు


డీఆర్డీఏ కార్యాలయంలో గదికి తాళం వేసిన సిబ్బంది

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని డీఆర్డీఏ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేరు. కార్యాలయంలో కొంతమంది అధికారులు సెలవులపై, మరికొందరు కార్యాలయానికి రాలేదు. డ్వాక్రా మహిళలకు సంబంధించి రుణాలు తీసుకోవాలన్నా, రుణాలు చెల్లించాలన్నా, ఏమైనా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా డీఆర్డీఏ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండాలి. కానీ సోమవారం అధికారులు ఎవరూ లేకపోవడంతో కార్యాలయానికి తాళాలు వేశారు. అధికారులు లేకపోవడంతో పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెళ్లిపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డీఆర్డీఏ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులతో కరస్పాండెంట్ సోమశేఖరరెడ్డి


పులివెందుల టౌన్ : విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ సోమశేఖరరెడ్డి అన్నారు. స్వామి వివేకానంద పాఠశాలలో విద్యను అభ్యసించి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ ఆఫ్ ఎక్సలెన్సీ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో పరీక్షల్లో ఓ.ఝాన్సీలక్ష్మి 595 మార్కులు, ఎస్.జాషువా 594, వై.గంగా బాలాజిరెడ్డి, అర్చన 593 మార్కులు, జె. మహాలక్ష్మి, ఆర్.నిషిత 593 మార్కులు సాధించి రూ. 50వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులను డైరెక్టర్ సాయి శరణ్‌రెడ్డి, పాఠశాల డీన్ వసీం, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు గీత, గంగరాజు అభినందించారు.

టెంకాయల వేలం పాట


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న కొత్తపేట గంగమ్మ దేవస్థానంలో సోమవారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. టెంకాయల విక్రయానికి పోటాపోటీగా వేలం పాట పాడారు. అయితే వెంకటలక్ష్మి అనే మహిళ రూ. 4,01,000 దక్కించుకున్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 2026, జనవరి 31వ తేది వరకు వేలం పాట నిర్వహించారు. వేలం దక్కించుకున్నవారు గంగమ్మ గుడి వద్ద టెంకాయలు విక్రయించుకోవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

వైద్యశిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రవణ్‌కుమార్

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఆసుపత్రిలో ప్రొద్దుటూరుకు చెందిన హ్యాపీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ ఎం శ్రవణ్‌కుమార్ ఆర్టీపీపీలోని ఉద్యోగులకు, వారికుటుంబ సభ్యులకు దంత పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పోలేరమ్మకు రథం బహూకరణ

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలో కనుమ పోలేరమ్మకు బళ్లారికి చెందిన భీమినేని చిన్న ఈశ్వరయ్య కుమారుడు కాశీనాయుడు కుటుంబ సభ్యులు ఉత్సవ రథం వితరణ చేసినట్లు మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. సోమవారం రథానికి బ్రహ్మంగారిగుడి దగ్గర పూజలు చేశారు. పోలేరమ్మ గుడిలో జరిగే ఉత్సవాలకు అమ్మవారిని కొత్త రథంపై ఊరేగిస్తామని మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు.

రీ–సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

ఆర్డీఓ జాన్ ఇర్విన్


మాట్లాడుతున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

వల్లూరు (చెన్నూరు) : భూ సర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని ఆర్డీఓ జాన్ ఇర్విన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా నిర్వహించే భూముల రీ సర్వే అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం మండలంలోని భూ రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌కు ఎన్నికైన శివాలపల్లి గ్రామంలో రీ సర్వేను ఆర్డీఓ ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా రీ సర్వేకు హాజరు కావాలని సూచించారు. రైతులు గ్రామాల్లో లేకపోయినా ఈ విషయాన్ని సర్వే సమయానికి వారికి తెలియజేసి వారు వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో భూముల సమస్యలు ఉంటే రెవెన్యూ సిబ్బందికి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి రీ సర్వేను పరిశీలించారు. శివాలపల్లి గ్రామంలో 897.28 ఎకరాల భూమి ఉందని, 389 ఖాతాలు ఉన్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, మండల సర్వేయర్ సోమశేఖర్, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల తనిఖీ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో మంగళవారం నుంచి పింఛన్ల తనిఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన బుధవారం పెద్ద రంగాపురం, సియోన్‌పురం, చెన్నారెడ్డి కాలనీ, బయమ్మ తోట, మిస్సమ్మ బంగ్లా సచివాలయాలు, 22న గుంతబజార్, వెంకటాపురం, భాకరాపురం, వెలమవారిపల్లె, ప్రశాంతి నగర్, అంకాలమ్మపేట, నగరిగుట్ట, శ్రీరామా టెంపుల్, రాజీవ్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, చిన్న రంగాపురం సచివాలయాల పరిధిలో ఉన్న ఫించన్ల లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పునః పరిశీలించనున్నారని, కావున ఆయా తేదీలలో పింఛన్ లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండాలన్నారు. సచివాలయాల వద్దకు కానీ, ఏ ఇతర ఆఫీసుల వద్దకు కానీ వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు

పులివెందుల పట్టణంలో మంగళవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. 21న చెన్నారెడ్డి కాలనీ, నగరిగుట్ట, 22న ప్రశాంతి నగర్, 23న పెద్దకొండప్ప కాలనీ, భాకరాపురం, 24వతేదీన ఉలిమెల్ల సచివాలయం, రాజీవ్ కాలనీ సచివాయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకుల్లో భద్రతా చర్యలు తీసుకోవాలి


కెనరా బ్యాంకును పరిశీలిస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

వేంపల్లె : వేంపల్లెలో ఉన్న అన్ని బ్యాంకుల్లో తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని సీఐ సురేష్ రెడ్డి సూచించారు. పులివెందుల డీఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం వేంపల్లె సీఐ సురేష్ రెడ్డి, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్ నాయక్ వేంపల్లెలోని పలు బ్యాంకులను తమ సిబ్బందితో పరిశీలించారు. బ్యాంకులో ఏ విధమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారని పరిశీలించారు. అనంతరం బ్యాంకు సిబ్బందితో సమావేశమై బ్యాంకుల్లో దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భద్రతా చర్యలు పాటించాలని బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లె : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని వేంపల్లె ఎస్ఐ తిరుపాల్ నాయక్ హెచ్చరించారు. సోమవారం ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, లైసెన్సులు లేకుండా తిరుగుతున్న వారికి జరిమానాలు విధించి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. పట్టణంలోని మెయిన్ సర్కిళ్లల్లో తోపుడు బండ్లు, టూ వీలర్స్, వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

24న డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

జమ్మలమడుగు: డివిజన్ పరిధిలోని రేషన్ షాపులకు డీలర్ల ఎంపిక కోసం ఈ నెల 24వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ సాయిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని పది మండలాల్లో 251 చౌకదుకాణాల రేషన్ డీలర్ల అర్హత పరీక్షకు దరఖాస్తు చేస్తుకున్నారని తెలిపారు. 24వ తేదీ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (బాలికల) మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ప్రభుత్వ చౌక దుకాణాదారుల ఎంపిక కోసం ఈ నెల 24వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు యర్రగుంట్ల తహసీల్దార్ శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనతో పేర్కొన్నారు. పరీక్షను జమ్మలమడుగు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల (బాలికల) మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

చెత్తకు నిప్పు.. కాలిన చెట్లు


చెత్తకు నిప్పు పెట్టడంతో కాలిపోయిన చెట్లు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని మొక్కలు చనిపోగా మరికొన్ని బతికాయి. బతికిన ఈ చెట్ల పక్కనే గ్రామ పంచాయతీలోని గ్రామాల నుంచి తెచ్చిన చెత్తాచెదారాన్ని వేశారు. కార్యాలయ ఆవరణమంతా చెత్త నిండిపోవడంతో సోమవారం నిప్పు పెట్టగా చెట్లు కాలి బూడిదయ్యాయి. ఈ గ్రామ పంచాయతీకి ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం కార్యాలయానికి వచ్చే ఆయన పచ్చని చెట్ల మధ్య డంప్ యార్డును తయారు చేసిన విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. చెట్లు కాలిపోయిన విషయంపై ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా కొత్తపల్లె గ్రామ పంచాయతీకి డంప్ యార్డు లేదని, మున్సిపాలిటీకి చెందిన డంప్ యార్డులో చెత్తను తరలించేందుకు అనుమతుల కోసం లేఖ రాశామన్నారు. మున్సిపల్ కౌన్సిల్ అనుమతి రాగానే చెత్తను డంప్ యార్డుకు తరలిస్తామన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన


ఎర్రగుంట్ల : పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


జమ్మలమడుగు రూరల్: గొర్రెలకు టీకాలు వేస్తున్న డాక్టర్ దస్తగిరమ్మ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని రంగసాయిపురం గ్రామంలోని పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని యర్రగుంట్ల పశుసంవర్ధశాఖ ఏడీ డాక్టర్ మునెయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 11 గర్భకోశ చికిత్సలు, ఐదు ఎదసూదులు, 48 లేగదూడలకు ఏలిక పాముల మందులు, 50 జీవాలకు నట్టల నివారణ మందులు, 23 సాధారణ కేసులకు వైద్యం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట్ల , పోట్లదుర్తి పశువైద్యాధికారులు డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టరు జ్యోతిలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి దస్తగిరమ్మ సూచించారు. సోమవారం మండల పరిధిలోని పి. సుగుమంచిపల్లె గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలకు నట్టల నివారణ మందులు, టీకాలు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం పశువులకు టీకాలు వేశారు. వైద్యులు ఏడీ శ్రీధర్‌రెడ్డి, జాన్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ


శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వీరపునాయునిపల్లె: బుడ్డ శనగలో సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లను నివారించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్ బాబు, గిరీష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబుతో కలిసి శనగ పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం శనగ పంటలో వేరుకుళ్లు, త్రుప్పు కుళ్లు సోకినట్లు గుర్తించామని తెలిపారు. నీటి ఎద్దడి సమయంలో అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు వేరు కుళ్ల తెగులు ఎక్కువగా ఆశిస్తుందని, పూత, కాయ దశలో ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. సకాలంలో విత్తుకోవడం వలన పంటలు చివరి దశలో నీటి ఎద్దడికి అధిక ఉష్ణోగ్రత్తలకు గురికాకుండా చూసుకోవడం వలన తెగుళ్ల తీవ్రతను తగ్గించవచ్చని తెలిపారు. తెగుళ్ల ఉధృతిని తగ్గించేందుకు ఎకరాకు 2 కిలోలు ట్రైకోడెర్మా పొడిని 4 కిలోల వేప చెక్కతో కలిపి పశువుల ఎరువులో 10–15 రోజుల వ్యవధిలో పొలంలో చల్లుకోవాలని సూచించారు.

చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి


ఆర్డీఓకు బాధిత కుటుంబ సభ్యులతో కలసి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మలమడుగు రూరల్: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని బీజేపీ నాయకులు శిలివేరి వెంకటేశ్వర్లు, పాములేటి కోరారు. మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకు చెందిన ఊసువాండ్ల వెంకటేశ్ మైలవరం జలాశయంలో దూకి అత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం సోమవారం జమ్మలమడుగు బాధిత కుటుంబసభ్యులతో కలసి ఆర్డీఓ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. వెంకటేష్ మృతి చెందండంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందేలా చూడాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గడువులోపు రుణం రెన్యువల్ చేసుకోండి

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణం తీసుకున్న రైతులు వడ్డీని గడువులోపు చెల్లించి రెన్యువల్ చేసుకుంటే అపరాధ రుసుం ఉండదని ముఖ్య కార్యనిర్వహణాధికారి రెహిమాన్ తెలిపారు. సోమవారం ఆయన మట్లాడుతూ పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి కొందరు రైతులు కొన్నేళ్లగా రెన్యువల్ చేసుకోలేదని, అలాంటి వారికి అపరాధ రుసుంతో కలిపితే ఎక్కువ వడ్డీ వస్తుందన్నారు. వచ్చేనెల 15వ తేదీలోపు రెన్యువల్ చేసుకుంటే అపరాద రుసుం చెల్లిచాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే రుణాలను రెన్యువల్ చేసుకుని బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు : పద్మశాలి ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉద్యోగులందరూ సంఘంలో చేరి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పద్మశాలి కల్యాణ మండపం అధ్యక్షుడు అవ్వారు తాండవ కృష్ణ మాట్లాడుతూ సంఘం సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని శాఖల సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్ఞానశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

రత్నకుమారికి సావిత్రిబాయి పూలే అవార్డు


అవార్డు అందుకుంటున్న రత్నకుమారి

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రత్నకుమారి సావిత్రిబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఈనెల 19వ తేదీన గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లోని అసెంబ్లీ హాలులో ఎస్పీఎల్‌టీఓ సంస్థ నిర్వహించిన సభలో రత్నకుమారికి అవార్డును ప్రదానం చేశారు. రత్నకుమారిని డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అధ్యాపక బృందం అభినందించారు.

ఉక్కు పరిశ్రమ కోసం పోరాటం

ప్రొద్దుటూరు : రాయలసీమకు సంజీవని లాంటి కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తామని డీవైఎఫ్ఐ మాజీ నాయకుడు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ తెలిపారు. సోమవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమ పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. పరిశ్రమ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడి తేవడంలో విఫలమయ్యాయన్నారు. రాబోవు రోజుల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ కోసం పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మేరి కుమార్, కార్యదర్శిగా విశ్వనాథ్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సభ్యులుగా చిన్న, సుబ్బారావు, రమేష్, పక్కీరయ్యలను ఎన్నుకున్నారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం


తొండూరు: కుష్టు వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


లింగాల : సర్వేను పరిశీలిస్తున్న డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి

తొండూరు : కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యమని తొండూరు పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా ప్రకటించారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అరిపుల్లా ఆధ్వర్యంలో సోమవారం సిబ్బందికి, ప్రజలకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అన్ని వయస్సుల వారీ శరీరంపైన స్పర్శలేని మచ్చలను గుర్తించాలని ఆదేశించారు. అనుమానితులను పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి కేసులను త్వరగా గుర్తించి వెంటనే చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం నుంచి రక్షించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నిర్ధారణకు సర్వే

లింగాల : లింగాల మండలంలో కుష్టు వ్యాధి నిర్ధారణకు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే ఫిబ్రవరి 2వ తేదీవరకు అన్ని గ్రామాల్లో ఇంటింటా నిర్వహిస్తామని డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికీ స్పర్శలేని తెల్లని, నల్లని మచ్చలను గుర్తించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. సోమవారం బోనాల గ్రామంలో కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వే కార్యక్రమాన్ని డీఎంపీఓ పర్యవేక్షించారు. సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్ ఆశాబేగం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.